క్లుప్తంగా

మద్యంషాపు తొలగించాలి

రేగొండ (కొత్తపల్లిగోరి): జనావాసాల మధ్య లో ఉన్న మద్యంషాపును తొలగించాలని గంద్ర యువసేన మండల అధ్యక్షుడు సూదన బోయిన సుమన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగొండ–జాకారం ప్రధాన రోడ్డులో జనావాసాల మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన వైన్స్‌షాపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మందుబాబుల ఆగడాలతో మహిళలు, పిల్లలు బయటకు రాలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనావాసాలలో ఏర్పాటు చేసిన వైన్స్ షాపును వెంటనే తొలగించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడు తామని హెచ్చరించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

మొగుళ్లపల్లి: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్వహించిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణవేణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 01 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు నిర్వహించిన పనులపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు. జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి పురుషోత్తం హాజరవుతున్నట్లు తెలిపారు.

పరామర్శ




మహాముత్తారం: మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామానికి చెందిన మేకల సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం జెడ్పీటీసీ లింగమల్ల శారద పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పంగిలి రవీంద్రారెడ్డి, మల్లారెడ్డి, మూడెత్తుల రాజు, మునుకుర్తి చెందు, ఒడేటి రాజెందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీమా పరిహారం అందజేత

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన నాగరబోయిన పెద్ద నర్సయ్య కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా పెద్ద నర్సయ్య సతీమణి రాజమ్మకు స్థానిక కాకతీయ పురుషుల పొదుపు సంఘం ఆధ్వర్యంలో పొదుపు, బోనస్, అభయనిధి బీమా పరిహారం మొత్తం రూ.1.26 లక్షలను అధ్యక్షుడు నంగునూరి సాంబయ్య ఆదివారం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని సంఘం అధ్యక్షుడు, కార్యవర్గం పరామర్శించింది. పెద్ద నర్సయ్య మృతి బాధాకరమని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పుచ్చ స్వామి, కొత్తపల్లి రాజయ్య, ఎరెల్లి రాజేందర్, కొండబత్తుల నర్సింహారాములు, పెండ్యాల గిరి, పెండెం శ్రీనివాస్, కాసిడి అజయ్, ములకస్వామి, గణకుడు గుండెబోయిన రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు



మహబూబాబాద్ రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేలోత్ సాయికుమార్, సంఘం డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, నాయకులు వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ క్రిస్మస్ వేడుకలు



నల్లబెల్లి: మండల కేంద్రంలోని పరితోమా దేవాలయంలో చిల్డ్రన్స్ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంఘ కాపరి ఈపీ.ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభువు ఆశీర్వాదంతో ప్రజలకు శాంతి, సమాధానం కలగాలని ఆకాంక్షించారు. చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ పాస్టోరేట్ సెక్రెటరీ నాగెల్లి ప్రకాష్, సంఘ పెద్దలు పొడేటి ప్రకాశం, పరికి త్యాగరాజు, కల్లెపల్లి రఘువరణ్, పొడేటి నవీన్, ఈదునూరి విజయ్‌కుమార్, జన్ను రంజిత్, కనుకం శ్రీకాంత్, సునీల్, వక్కల దిలీప్, కుక్కముడి సుమన్, స్త్రీల మైత్రి సెక్రెటరీ నాగెల్లి పావని, పరికి సువర్ణ, శ్రీలత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలు



ఏటూరు వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

- ప్రధాన రహదారుల్లో ఇరువైపులా పిచ్చిమొక్కలు
- అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణిస్తున్న ప్రజలు

కన్నాయిగూడెం: మండలంలోని ప్రధాన రహదారులు, మలపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరిగి రోడ్లు పూర్తిగా కమ్మివేశాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తుపాకులగూడెం నుంచి ఏటూరు నాగారం వరకు ఉన్న ప్రధాన రహదారి సింగిల్ రోడ్డు కావడంతో పాటు ఏటూరు నుంచి ఏటూరు నాగారం వరకు ఉన్న రోడ్డు అటవీ ప్రాంతంలో ఇమిడి ఉంటుంది. దీంతో రోడ్డుకిరువైపుల ముళ్ల పొదలు ఏపుగా పెరిగి ప్రధాన రహదారిని పూర్తిగా మూసివేశాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రహదారి కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాటిని తొలగించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు చోద్యంగా చూస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కనీసం మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

నిత్యం రద్దీగా రహదారి

తుపాకులగూడెం ప్రధానరహదారి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారి వెంట పలిమెల, మహదేవపూర్, మహారాష్ట్ర పొంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఏటూరునాగారం నుంచి హన్మకొండకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత అధికారులు ముళ్ల పొందలను తొలగించాలని కోరుతున్నారు.

ఏటూరు మలుపు వద్ద ప్రమాదాలు

తుపాకులగూడెం నుంచి ఏటూరునాగారం రహదారిలో ఏటూరు పొలాల ప్రాంతంలో ఉన్న మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తూ మలుపు వద్ద ఆర్టీసీ బస్సుకింద పడి ప్రాణాలను కోల్పోయారు. మరోసారి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుకిందకి జారడంతో ప్రమాదానికి గురి కాగా డ్రైవర్ చొరవతో పెద్ద ప్రమాదం తప్పింది. రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మిరపతోటను పరిశీలిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: మిచాంగ్ తుపాన్‌తో నష్టపోయిన గిరిజన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ కోరారు. మానుకోట మండలంలోని మల్యాల, రేగడి తండా, భావుసింగ్ తండాలలో పంటలను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా నందులాల్ నాయక్ మాట్లాడుతూ.. పంటలకు నష్ట పరిహారం అందజేయాలని, అలాగే తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంట భీమాను విస్మరించి రైతులకు నష్టం చేకూర్చిందని, నూతన ప్రభుత్వం పంట బీమాను ప్రవేశపెట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బోడ కర్ణుడు, ఇస్లావత్ పరమేష్, బానోత్ చంద్రు, బాదావత్ భద్రు, సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబునాయక్, జిల్లా అధికార ప్రతినిధి సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ వినోద్ నాయక్, రైతుసేన జిల్లా అధ్యక్షుడు లింగనాయక్, బానోత్ శ్రీను, ప్రశాంత్, ప్రకాష్ పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని పూజలు



పూజలు నిర్వహిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: కేసీఆర్ ఆరోగ్యం కోలుకోవాలని మండల కేంద్రంలోని పూట్‌పారంలోని సమ్మక్క–సారక్క గుడిలో బీఆర్ఎస్ నాయకులు పూజలు నిర్వహించారు. గోవిందరావుపేట మండలంలో సుప్రసిద్ధమైన ఫ్రూట్‌ఫారంలో ఉన్న సమ్మక్క సారక్క గుడిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి లకావత్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో పూజారి ఈసం సమ్మయ్య పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి భూరెడ్డి మధు, అంజి బాబు, ఓదేలు, కృష్ణారెడ్డి, శ్యామ్, విజయ్, సంజీవ్, రఘువీర్, రవి, కనకయ్య, సమ్మయ్య, వెంకన్న, రంజిత్, శంకర్, నాగేంద్ర, తిరుపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల్లో హామీలు అమలు



ఆరోగ్య శ్రీ సేవలను ప్రారంభిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఎమ్మెల్యే రేవూరిని కలిసిన ఏసీపీ కిశోర్‌కుమార్, శాయంపేట సీఐ మల్లేశం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో తప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేయూత స్కీంలో భాగంగా రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించడంతో పాటు మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, కౌన్సిలర్ జయమ్మ, కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నియోజవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేవూరిని కలిసిన అధికారులు

ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్‌తో పాటు సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం రవిచంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపేందుకు పోటెత్తడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోలాహలం నెలకొంది.

పరకాల జిల్లా కేంద్రం కోసం జర్నలిస్టుల వినతి

ఎంతో చరిత్ర కలిగిన పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించేందుకు కొత్త ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని పరకాల జర్నలిస్టుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రేపాల నర్సింహారాములు, బాబ్జీ, సునేందర్, రాజు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

మహాముత్తారం: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని జెడ్పీటీసీ లింగమల్ల శారద, సర్పంచ్ భూసి దేవెందర్‌రెడ్డి అన్నారు. మండలంలో రేగులగూడెం గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు న్నారు.

కనుల పండువగా అయ్యప్ప ‘పడిపూజ’

కమలాపూర్ : మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త్రా అయ్యప్పస్వామి దేవాలయంలో గరుస్వామి ఇందుర్తి జానకిరామారావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి నూక నాగరాజు–వర్షిత దంపతులు అయ్యప్పస్వామి దివ్య పడిపూజా మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పదునెట్టాంబడి కార్యక్రమాలు చేశారు. అయ్యప్ప స్వాములు భక్తి భజనలు, నృత్యాలు చేశారు. అంతకుముందు గుర్మిళ్ల రమణ–విజయనిర్మల దంపతులు అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సేవా సమితి చైర్మన్ నేరెళ్ల అశోక్‌గౌడ్, అయ్యప్ప స్వాములు పచ్చిమట్ల రాజయ్యగౌడ్, ఎండపెల్లి మల్లారెడ్డి, సదానందం, కుమారస్వామి, అయ్యప్ప మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కార్తీక జ్యోతిర్మహోత్సవం

వెంకటాపురం(కె): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని మంగపేట గోదావరి రేవుకు వెళ్లే దారిలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కార్తీక జ్యోతిర్మహోత్సవ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమంతో పాటు సిందూర పూజా, నాగవల్లి కార్యక్రమం నిర్వహిచనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ వద్ద 10,302 వత్తులతో కార్తీక జ్యోతిర్ మహోత్సవ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

శాయంపేట : మండల కేంద్రంలోని శివమార్కండేయ వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాల్లో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్ స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

కురవి: మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అల్ల రవి, పీఈటీ దార్ల సునీల్ ఆదివారం తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో నర్సంపేట మండలంలోని మాధన్నపేట జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 8వ తేదీన జరిగిన జిల్లాస్థాయి పోటీలో అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థులు దారావత్ కిషోర్, మూడ్ వంశీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు దామోదర్, టీకు చౌహన్, సురేష్, రవికుమార్, రాజేశ్వరీ, వీరభద్రం, వీరన్న, ఎస్ఎంసీ చైర్మన్ సైదులు, సర్పంచ్ ఎస్‌కె మస్తాన్ అభినందించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



చిట్యాల: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన చిట్యాల మండలంలోని భౌసింగ్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు మేరుగు సదానందం తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ముందు ఉన్న గేదెపై విద్యుత్ వైరు తెగి పడడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో సుమారు రూ.50వేల పాడి గేదె మృతి చెందగా ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు.

కోతుల బెడద నుంచి విముక్తి

- సొంత ఖర్చుతో బోన్లు ఏర్పాటు చేసిన సుమలతసక్రునాయక్



కోతులు పట్టడానికి ఏర్పాటు చేసిన బోన్లు

గోవిందరావుపేట: కోతుల బెడద నుంచి ఉపశమనం కోసం పస్రా గ్రామానికి చెందిన సుమలత సక్రునాయక్ బోన్లు ఏర్పాటు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పస్రా గ్రామంలో సమ్మక్క సారక్క వాటర్ ప్లాంట్ వద్ద కోతులు పట్టడానికి తన సొంత ఖర్చులతో ఇనుప కంచ బోన్లు పక్క గ్రామంలో నుంచి కిరాయికి తీసుకచ్చి కోతులను పట్టి అడవిలో వదిలేశారు. కోతుల బెడద వల్ల చాలా మంది నష్ట పోతున్నారని తెలిపారు. ప్రజల బాధ చూడలేక సొంత ఖర్చులతో బోన్లు ఏర్పాటు చేసి కోతులను పట్టి అడవిలో వదిలేస్తున్నామని సుమలత సక్రునాయక్ తెలిపారు. కోతులు పట్టడానికి పట్టపు మల్లారెడ్డి, ఎర్రధనమ్మ, ధరావత్ పున్నం చందర్ సహకారం అందించారని అన్నారు. మరి కొందరు గ్రామస్తులు సహకారం అందిస్తే పస్రా గ్రామంలో పూర్తిగా కోతుల బారి నుంచి రక్షించుకోవచ్చు అని తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అఫ్జల్

ఏటూరునాగారం: గ్రామీణ ప్రాంతాల్లోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏటూరునాగారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎండీ.అఫ్జల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)ను మర్యాదపూర్వకంగా కలిసి పూలగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. స్థలం కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

ఘనంగా సామూహిక వ్రతాలు



మహబూబాబాద్ రూరల్: వ్రత పూజలు చేస్తున్న భక్తులు



కేసముద్రం: వత్రం నిర్వహిస్తున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: కార్తీకమాసం సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీమహాగాయత్రీ అమ్మవారి దేవాలయంలో ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు చేసిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు చేశారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీరామమందిరంలో సామూహిక శ్రీఅనఘా వ్రతాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తభక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్రతాన్ని తెలంగాణ దత్త ప్రచారకర్త, మైసూరు ఆశ్రమం పీఠానికి చెందిన రాజేంద్రప్రసాద్ వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో దత్తభక్తులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, లింగమూర్తి, ఏకాంతం, విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు



డోర్నకల్ స్టేషన్‌లో నిలిచిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ మీదుగా నడిచే రైళ్లు తరచూ రద్దవుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనా ప్రభావం ఉండడంతో 2020 మార్చి 21నుంచి డోర్నకల్ జంక్షన్ మీదుగా నడిచే రైళ్లన్నీ రద్దు కావడంతో నాలుగు నెలల తరువాత కొన్ని రైళ్లను మాత్రమే పునరుద్ధరించారు. డోర్నకల్ మీదుగా ఖమ్మం, విజయవాడ, తిరుపతి, వరంగల్, హైదరాబాద్, సిర్పూర్‌కాగజ్‌నగర్, కొత్తగూడెం, మణుగూరు తదితర ప్రాంతాలకు ప్రతీరోజూ అనేకమంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తుంటారు. కరోనా సమయం నుంచి అనేక రైళ్లు రద్దవుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగూడెం మార్గంలో ముఖ్యమైన రైళ్లు రద్దు కావడం, మణుగూరు ప్యాసింజర్‌తోపాటు విజయవాడ, ఖాజీపేట మధ్య నడిచే పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతో కూలీలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం మూడో లైను నిర్మాణ పనులతో తరచూ రైళ్లను రద్దు చేస్తుండడంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వరంగల్, చింతలపల్లి మధ్య మూడో లైను నిర్మాణ పనులతో ప్యాసింజర్ రైళ్లతోపాటు శాతవాహన, ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్ లాంటి ముఖ్యమైన రైళ్లతోపాటు కొత్తగూడెం మార్గంలో రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం పగటి వేళల్లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ లాంటి ఒకట్రెండు రైళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 19వ వరకు రైళ్ల కొనసాగే అవకాశాలు ఉండడంతో ఇబ్బందులు కొనసాగనున్నాయి.

పత్తి కట్టెను భూమిలోనే కలియదున్నాలి

దుగ్గొండి: గులాబీ రంగు పురుగు ఉధృతి నేపథ్యంలో పత్తి పంట కొనసాగించే పరిస్థితి లేకపోయే తరుణంలో పత్తి కట్టెను పీకి తగులబెట్టకుండా ట్రాక్టర్ రోటోవీటర్ సాయంతో భూమిలోనే కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) చిలువేరు దయాకర్ సూచించారు. ప్రస్తుతం పత్తి పంట కాలపరిమితి ముగిసింది. గులాబీ రంగు పురుగు ఉధృతి పెరిగింది. ఇంకా పంట కొనసాగించే పరిస్థితి లేదు. దీంతో రైతులు పత్తి స్థానంలో రెండో పంటకు సిద్ధం అవుతున్నారు. మండలంలో 13 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పత్తి దిగుబడులు ఆశించిన మేరకు రాలేదు. ఎకరాకు 3–5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. సాగునీరు అందించి పత్తి కొనసాగిద్దామంటే గులాబీ రంగు పురుగు విపరీతంగా వ్యాపించింది. దీంతో చేసేదేమీ లేక రైతులు పత్తిని తీసేసి రెండో పంటగా మొక్కజొన్న, వేరుశనగ, బొబ్బెర, మినుము, పెసర, నువ్వుల పంటలు సాగు చేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. అయితే పత్తి కట్టెను తీసేసి కాల్చకుండా నేలలోనే కలియదున్నితే భూమిలో సేంద్రీయ ఎరువులు అందుబాటులోకి వస్తాయని ఏఓ చెప్పారు. పశు సంపద లేకపోవడంతో సేంద్రీయ ఎరువులు వాడటం లేదు. ఈ క్రమంలో భూసారం తగ్గుతోంది. మెరుగైన దిగుబడి ఇచ్చే పంట రావాలంటే భూసారం బాగుండాలి. నేలలో సేంద్రీయ కర్బన పదార్థాలు అందుబాటులో ఉంటే భూమి బలంగా ఉండటంతోపాటు వేసిన రసాయనిక ఎరువులను సైతం తీసుకుంటుంది. ఎకరం పత్తి చేలో 10–30 క్వింటాళ్ల పత్తి కట్టె ఉంటుంది. ఎకరం పత్తి కట్టె ద్వారా 5–30 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ నేలకు అందుతాయి. సూక్ష్మపోషకాలు సైతం లభిస్తాయి. నేలలో నీటిని ఎక్కువకాలం నిలుపుకునే శక్తి వస్తుంది.